అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 204. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.01.05.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## ఇన్సూరెన్స్ పాలసీలపై సైబర్ కన్ను

అమృత్ తెలంగాణ: మీ ఫోన్‌కు ఇన్సూరెన్స్ పాలసీలు, రెన్యువల్ పేరుతో మెసేజ్‌లు వస్తున్నాయా? ఫోన్‌కాల్స్, లింక్‌లు వస్తున్నాయా? అయితే జాగ్రత్త. ఇది సైబర్ దొంగల పని అయ్యే అవకాశం ఎక్కువ. ఏమరుపాటున ఆ లింకులను క్లిక్ చేస్తే ఇక నిండా మునిగినట్లే! అనిహెచ్చరిస్తున్నారు సైబర్ క్రైం పోలీసులు. ఇప్పటివరకు వివిధ రూపాల్లో ఆశలు పెట్టి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు ఇప్పుడు బీమా రంగంపైనా వల విసురుతున్నారు.బీమా బదలాయింపులు, సాంకేతిక సమస్యల సాకుతో, రెన్యువల్స్ పేరుతో సైబర్ దొంగలు మోసాలకు పాల్పడుతున్నారు. ప్రముఖ బీమా కంపెనీల పేర్లతోనకిలీ ఈ-మెయిల్స్, మెసేజ్‌లు పంపి డబ్బులు కొల్లగొడుతున్న సంఘటనలు ఇటీవలకాలంలో విపరీతంగా పెరిగిపోయాయని సైబర్‌క్రైమ్ పోలీసులు తెలిపారు. గత మూడు నెలల్లో సైబర్ పీఎస్‌కు వచ్చిన కేసుల్లో ఈ తరహాకేసులు దాదాపు 30శాతంఉన్నాయని వారు పేర్కొన్నారు. మార్చి నెలాఖరులోగా గడువు ముగుస్తుందంటూ, ఒకవేళ కట్టకపోతే కట్టిన పాత డబ్బులు పోతాయంటూ బెదిరించి వారు పంపే లింక్‌లలో డబ్బులు కట్టాలంటూ ఒత్తిడి చేస్తున్నారు.

## రేపటి నుంచి ఇంజినీరింగ్ పరీక్షలు నేడు ఎప్‌సెట్ పరీక్షలకు విరామం

హైదరాబాద్, ఏప్రిల్ 30 అమృత్ తెలంగాణ: టీజీ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నాయి. మే డే సందర్భంగా గురువారం పరీక్షలకు విరామం ప్రకటించారు. ఇంజినీరింగ్ విభాగానికి ఈ నెల 2,3,4 తేదీల్లో మొత్తం ఆరు సెషన్లల్లో పరీక్షలు జరుగుతాయి. ఇంజనీరింగ్ విభాగానికి 2,20,117 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలు బుధవారంతో ముగిశాయి. మంగళవారం రెండు సెషన్లు, బుధవారం ఒక సెషన్‌లో పరీక్షలు నిర్వహించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి బుధవారం బాచుపల్లిలోని వీఎన్నార్ విజ్ఞానజ్యోతి ఇంజినీరింగ్ కాలేజీ సెంటర్‌ను సందర్శించారు.

# రజతోత్సవ జోష్.. గ్రేటర్‌లో విస్తృతంగా చర్చ..

కంటోన్మెంట్, ఏప్రిల్ 30 :అమృత్ తెలంగాణ: ఉమ్మడి వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ సక్సెస్ కావడంతో పార్టీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సభకు నాయకులు, కార్యకర్తలతోపాటు వేలాది మంది తెలంగాణవాదులు, ఉద్యమ సానుభూతిపరులు, కేసీఆర్, కేటీఆర్ అభిమానులు గ్రేటర్ నుంచి భారీ సంఖ్యలో తరలివెళ్లారు. ఇతర పార్టీలకు భిన్నంగా వరంగల్ తరలివెళ్లేందుకు చాలామంది స్వచ్ఛందంగా ముందుకు రావడంపై బీఆర్ఎస్‌పై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్న సంకేతాలు కనిపించాయి. చాలా మంది పార్టీ కార్యకర్తలు రజతోత్సవ సభలో పాల్గొనేందుకు తమ సొంత వాహనాల్లో వెళ్లి కేసీఆర్‌పై అభిమానాన్ని చాటుకున్నారు. రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిగా తరలి వచ్చిన ఈ సభలో పార్టీ జాతీయ అధ్యక్షులు కేసీఆర్ చేసిన ప్రసంగం అందరిని ఎంతగానో ఆకట్టుకున్నది. కేసీఆర్ దిశానిర్దేశంతో పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నేతలంతా సిద్ధమవుతుతున్నారు. ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో లక్షలాదిగా జనం తరలిరావడంతో అధికార కాంగ్రెస్‌తోపాటు బీజేపీలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ప్రధానంగా గ్రేటర్ హైదరాబాద్ నుంచి వేలాది మంది వరంగల్‌కు తరలివెళ్లడాన్ని ఇక్కడి ఆ రెండు పార్టీల నేతలు తట్టుకోలేకపోతున్నారు. ఎంతమంది వెళ్లారనే దానిపై తమ అనుచరులతో ఆరా తీసినట్లు తెలిసింది. రజతోత్సవ సభలో కాంగ్రెస్, బీజేపీలపై కేసీఆర్ చేసిన విమర్శల దాడితో పాటు గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరోసారి ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ అసలు రంగును బయట పెట్టడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా బీఆర్ఎస్ సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ పార్టీలో ఆందోళన మొదలైంది.

ఊపిరి పోసిన కేసీఆర్ ప్రసంగం..

ఎల్కతుర్తి బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దాదాపు గంటకు పైగా ప్రసంగించిన తీరు బీఆర్ఎస్ కేడర్‌లో ఊపునిచ్చింది. ముఖ్యంగా బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాల ప్రాధాన్యతను వివరించడమే కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై విరుచుకుపడ్డారు. బీజేపీ వైఖరిపైనా ఆయన దుమ్మెత్తి పోశారు. ఈ రెండు పార్టీలపై కేసీఆర్ చేసిన విమర్శలు జనాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. కేసీఆర్ మాటలకు బహిరంగ సభ



ప్రాంగణం చప్పట్లతో మార్మోగిపోయింది. ఆ బహిరంగ సభ దృశ్యాలను టీవీల్లో చూసిన సాధారణ ప్రజలు కేసీఆర్ ప్రసంగానికి మంత్రముగ్ధులయ్యారు. గజ్జెల నాగేష్, మాజీ చైర్మన్, రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్

ఎల్కతుర్తి సభ స్ఫూర్తి నింపింది..

బీఆర్ఎస్ రజతోత్సవ సభ పార్టీశ్రేణులు, ప్రజల్లో స్ఫూర్తి నింపింది. కనీవినీ ఎరుగని రీతిలో సాగిన ఈ సభతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల్లో ఆత్మవిశ్వాసం పెంపొందింది. ప్రజలకు ఈ రజతోత్సవ సభ ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. తమవెంట బీఆర్ఎస్ పార్టీ ఉందని, కేసీఆర్ ఉన్నాడన్న నమ్మకాన్ని ఈ సభ ద్వారా ప్రజానీకానికి తెలియజెప్పారు. ప్రస్తుతం ప్రజలంతా బీఆర్ఎస్‌నే కోరుకుంటున్నారు. ఏడాదిన్నరగా ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రజతోత్సవ సభలో చేసిన ప్రసంగం అద్భుతంగా ఉంది. కోట్లాదిమంది ప్రజలు ఆయన ప్రసంగాన్ని విన్నారు. తాను రాష్ట్రం కోసం, తెలంగాణ ప్రజల కోసం చేసిన పనులను వివరించారు. అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలకు చేస్తున్న మోసాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. - మన్నె క్రిశాంక్, మాజీ చైర్మన్, రాష్ట్ర ఖనిజా

## హైదరాబాద్ కేంద్ర కుల గణన ప్రకటనను స్వాగతించిన మంత్రి సీతక్క
## విధిలేని పరిస్థితుల్లోనే దిగొచ్చిన కేంద్రం

అమృత్ తెలంగాణ : దేశవ్యాప్తంగా జనగణన తో పాటు కుల గణనను చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడానికి మంత్రి సీతక్క స్వాగతించారు. పార్లమెంటు లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వారి ఆలోచనలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం కుల గణన ప్రక్రియను పూర్తి చేయగా, ఇప్పుడు విది లేని పరిస్థితుల్లో కేంద్రం దిగొచ్చి కుల గణన చేపడతామని ప్రకటించడం తెలంగాణ ప్రభుత్వ ముందు చూపునకు నిదర్శనం అని సీతక్క పేర్కొన్నారు. తెలంగాణలో కుల గణన చేపట్టడంతో ఇతర రాష్ట్రాల్లో, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగిందని, ప్రజల డిమాండ్లకు తలొగ్గి తప్పనిసరి పరిస్థితుల్లోనే కేంద్ర ప్రభుత్వం కుల గణనకు అంగీకారం తెరపాల్సి వచ్చిందన్నారు. అయితే ఇప్పటికే జన గణన ఆలస్యమైన నేపథ్యంలో ప్రజలకు సంక్షేమం అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందుకే వీలైనంత తొందరగా జన గణన తో పాటు కుల గణన ప్రక్రియను పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు పెంచాలని కేంద్రాన్ని మంత్రి సీతక్క విజ్ఞప్తి చేశారు.



## టీజీపీఎస్సీకి చుకెదురు.. గ్రూప్-1 కేసులో సింగిల్ జడ్జి ఉత్తర్వుపై జోక్యానికి బెంచ్ నిరాకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 30, అమృత్ తెలంగాణ: గ్రూప్-1 నియామకాల ప్రక్రియ పూర్తి చేయరాదంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల అమలును రద్దు చేయాలని కోరుతూ టీజీపీఎస్సీ చేసిన అప్పీల్‌పై విచారించేందుకు హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల అమలును నిలిపివేసేందుకు నిరాకరించింది. ఈ వ్యవహారం సింగిల్ జడ్జి వద్ద ఉందని, ఆయన వద్దనే తేల్చుకోవాలని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు తాతాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, జస్టిస్ రేణుక యారాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. మధ్యంతర ఉత్తర్వులపై ఏ నిర్ణయమైనా సింగిల్ జడ్జే తీసుకోవాలని స్పష్టంచేసింది. ఈ వివాదాన్ని హైకోర్టుకు వేసవి సెలవుల్లోగానే పరిష్కరించాలని సింగిల్‌జడ్జికి సూచించింది. తొలుత టీజీపీఎస్సీ తరపు న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదనలు వినిపిస్తూ.. గ్రూప్-1 పోస్టుల నియామకాలన్నీ నిలిచిపోయాయని, ఇతర ప్రక్రియ అంతా పూర్తిచేశామని చెప్పారు. తమ వాదనలను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోకుండానే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారని అన్నారు. సింగిల్ జడ్జి వద్ద మధ్యాహ్నం విచారణ జరగనుందని చెప్పారు. దీనిపై




స్పందించిన ధర్మాసనం, మరి ఇంతలోనే తమ వద్దకు ఎందుకు వచ్చారని ప్రశ్నించింది.

## సస్పెండ్‌కు గురైనా ఆధిపత్యం ఆమెదే.. సౌత్ జోన్ ఆర్టీఏలో వింత..!

చార్మినార్, ఏప్రిల్ 30 :అమృత్ తెలంగాణ: అవినీతి ఆరోపణలతో బండ్లగూడ ఆర్టీవో ఆఫీస్‌లో పనిచేసిన ఏవో అడ్మినిస్ట్రేటివ్ అధికారిణి బి సునీతపై ఉన్నతధికారులు గట్టి చర్యలు తీసుకున్నారు. ఆమె అనేక అవినీతి అక్రమాలకు పాల్పడిన గత చరిత్రను ఉన్నతధికారులు గుర్తించారు. ఆమె ఎక్కడ విధులు నిర్వహించిన అక్కడ అక్రమాలు మాములే. ఆ విషయాలు ఉన్నతధికారులకు తెలియంది కాదని బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయ సిబ్బంది సైతం సునీత వ్యవహారంపై అంతర్గతంగా చర్చించుకుంటున్నారు.

గతంలో ఒక వాహనం నెంబర్ ఏపీ12వీ6331, ఇంకోవాహనం నెంబర్ ఏంహెచ్03ఎన్9381. ఈ వాహనాల టెంపరరి పర్మిట్ కాంట్రాక్ట్ క్యారేజ్ విషయంలో రవాణశాఖ నియమ నిబంధనలు పాటించకుండా ఇతర రాష్ట్రాల వాహనాలకు అనుమతులు జారిచేసి అక్రమాలకు పాల్పడింది. దీంతో అమెపై చర్యలు తీసుకోవాలని అప్పటి రవాణశాఖ కమిషనర్ సందీప్‌కుమార్ సుల్తానియా 2016 ఫిబ్రవరి 18న లిఖిత పూర్వకంగా ఆదేశాలు జారీ చేశారు. ఆ కేసు విచారణలో ప్రస్తుత మలక్‌పేట్ ఆర్టీవో అధికారి కిష్టయ్యను విచారణ అధికారిగా నియమించారు.

వారం రోజుల క్రితం బండ్లగూడ ఆఫీస్‌లో వాహాన నెంబర్ టీఎస్ 12టీ4888 వాహనం ట్రాన్స్‌ఫర్ ఆఫ్ పర్మిట్ విషయంలో వాహనదారుడి నుంచి






రూ.40 వేలు డిమాండ్ చేసింది. తన సహాయకుని ద్వారా 40 వేలు తీసుకుంది. దీంతో సదరు వాహనదారుడు రవాణశాఖ ఉన్నతాధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. స్పందించిన జాయింట్ కమిషనర్ సునీతను రవాణశాఖ ప్రధాన కార్యలయానికి ఆటాచ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. సునీత వ్యవహారంపై దర్యాప్తు చేసి రిపోర్టు ఇవ్వాలని దక్షిణ మండల ప్రాంతీయ రవాణశాఖ కార్యలయం ఇంచార్జీ ఆర్టీవో కిష్టయ్యను ఆదేశించారు. గతంలో ఆమెపై వచ్చిన అవినీతి ఆరోపణలో దర్యాప్తు అధికారిగా ఉన్న కిష్టయ్యకే ఈ విచారణ భాద్యతలు అప్పగించడంతో సిబ్బంది ఏమి జరుగుతుందోనని ప్రశ్నించుకుంటున్నారు.


ప్రతి కేసు విచారణ అధికారిగా ఉన్నతాధికారులు ఆయననే ఎందుకు నియమిస్తున్నారో తెలియడంలేదని పలువురు ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఉప్పల్ ఆర్టీఏ ఆఫీస్‌లో పనిచేసిన సమయంలో సునీతపై అవినీతి అక్రమాలకు పాల్పడిందని ఆరోపణలున్నాయి. ఇప్పటికైన ఇలాంటి అవినీతి అధికారులను సస్పెండ్ చేయడం, లేదా నగర బయటి కార్యాలయాల్లో విధులు కేటాయించాలని సునీత తోటి ఉద్యోగులే పేర్కొంటూ అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. భారీగా అవినితి ఆరోపణలు, విచారణలు ఎదుర్కొంటున్న అధికారిణికి సస్పెండ్ చేస్తారా లేదా మరోచోట పోస్టింగ్ ఇస్తారా అనే విషయంలో ఉద్యోగులు వేచి చూస్తున్నారు.

మళ్లీ ఇక్కడకే వస్తా

ప్రధాన కార్యాలయంలో అటాచ్‌గా ఉన్న సునీత తన పోస్టింగ్ బండ్లగూడలోనే వస్తుందని ధీమాగా ఉన్నట్లు తెలుస్తుంది. బండ్లగూడ కార్యాలయ సిబ్బందితో సునీత మాట్లాడుతూ ఏది ఏమైనా నేను ఇక్కడికే తిరిగి వస్తాను. అప్పుడు చూపిస్తాను తానేంటో అంటూ తోటి ఉద్యోగులతో మాట్లాడుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం.

## ఏ పథకం ఆగలేదు అనడానికి సీఎం రేవంత్‌కు సిగ్గుండాలి : హరీశ్‌రావు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: తెలంగాణలో అన్ని సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి రవీంద్ర భారతి వేదికగా చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ప్రజలు కష్టాల్లో ఉంటే ఎందుకు రావడం లేదని నువ్వే అంటున్నావు, మరోవైపు ప్రజలకు కష్టాలు లేవు, మాది ప్రజా పాలన అంటున్నావు రేవంత్‌కు జపాన్ వెళ్లి వచ్చి మైండ్ పాడైనట్లుంది లేకుంటే రజతోత్సవ సభకు వచ్చిన జనాన్ని చూసి మైండ్ బ్లాంక్ అయినట్లుంది. సిగ్గులేకుండా ఏ పథకం ఆగిపోయిందో చెప్పాలి అంటున్నడు కేసీఆర్ కిట్టు ఆగిపోలేదా, దళిత బంధు ఆగిపోలేదా, బీసీ బంధు ఆగిపోలేదా, గొర్రెల పంపిణీ ఆగిపోలేదా, రెండు నెలల పింఛన్లు ఆగలేదా, డబుల్ బెడ్ రూం ఇళ్లులు ఆగలేదా, స్కాలర్ షిప్స్ ఆగలేదా, ఫీజు రీయింబర్స్ మెంట్ ఆగలేదా. మీ 15 నెలల పాలనలో ఆగని పథకం ఏదైనా ఉందా? విద్యార్థులను ముందు పెట్టుకొని, ఇచ్చిన మాట మీద నిలబడుతా అని గొప్పలు చెప్పి సప్పట్లు కొట్టించుకుంటున్నవు అని రేవంత్ రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్ అయ్యారు.







## గ్రూప్-1 సందేహాలపై సమాధానం చెప్పండి టీజీపీఎస్సీ చైర్మన్‌కు కేంద్ర మంత్రి లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 30 :అమృత్ తెలంగాణ: గ్రూప్-1 అక్రమాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశానికి బుధవారం లేఖ రాశారు. అభ్యర్థులు లేవనెత్తిన పలు సందేహాలను ఆ లేఖలో బండి సంజయ్ ప్రస్తావించారు. వారం రోజుల్లో సమగ్ర సమాచారాన్ని అందజేయాలని కోరారు. మార్కుల ప్రకటన, నోటిఫికేషన్ ఉల్లంఘన, పరీక్ష పత్రాల మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లతోపాటు ఉర్దూ మీడియంలో రాసిన అభ్యర్థులకు టాప్ ర్యాంకులు రావడాన్ని ఆ లేఖలో ప్రస్తావించారు. మరో వైపు హైకోర్టులో గ్రూప్-1 కేసు విచారణ కొనసాగుతుండటంతో టీజీపీఎస్సీ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా



అవసరమైతే తాను సైతం ఇంప్లీడ్ కావాలని బండి సంజయ్ నిర్ణయించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ తరహాలో అవినీతి, అక్రమాలు, తప్పిదాలకు తావు లేకుండా మెరిట్ ప్రాతిపదికగా ఉద్యోగ నియామకాలు జరిగేలా టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించుకున్నారు.

# పదవ తరగతి ఫలితాలలో విజయ విద్యార్థుల ప్రభంజనం





పదవ తరగతి ఫలితాల్లో విజయ స్కూల్ విద్యార్థుల విజయ సంబరాలు

నిర్మల్ ఏప్రిల్ 30 అమృత్ తెలంగాణ తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసినటువంటి పదవ తరగతి ఫలితాలలో విజయ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించారు కె.లాస్య 600 మార్కులకు గాను 574 మార్కులు, సాదియా, నివేదన్, 569 మార్కులు సాధించారు. 69 మంది విద్యార్థులు 500కు పైన మార్కులు సాధించడం జరిగినది. ఈ సందర్భంగా పాఠశాల విద్యాలయం జనరల్ సెక్రెటరీ అయ్యన్నగారి భూమయ్య, మాట్లాడుతూ విద్యార్థులు పడిన కష్టానికి ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. భవిష్యత్తులో కూడా మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం వైస్ ప్రెసిడెంట్ అంబారాణి, కరెస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ట్రెజరర్ ఆడెపు సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ విజయలక్ష్మి, ఆమెడ కిషన్, ప్రిన్సిపల్ సామ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో శాంతినికేతన్ విద్యార్థుల ప్రభంజనం




పదవ తరగతిలో ప్రతిభ సాధించిన శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు



ప్రతిభ సాధించిన శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులను సన్మానిస్తున్న కరస్పాండెంట్ డైరెక్టర్ మరియు ఉపాధ్యాయులు

నిర్మల్ ఏప్రిల్ 30 అమృత్ తెలంగాణ తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసినటువంటి పదవ తరగతి ఫలితాలలో నిర్మల్ బ్రహ్మపురిలో గల శాంతినికేతన్ విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రభంజనం సృష్టించారు. పదవ తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించారు ఏ హర్షిని, 570. మార్కులతో పాఠశాల టాపర్ గా నిలిచారు కే ఆశ్రిత్, ,564. ఏ. అక్షర, 559. పి సహస్ర, 557. వి సాయి తేజ,556. పి సాయి రుత్విక్, 555. సీ త్రిలోచనా, 554. ఎం హర్షవర్ధిని,553. పి కిరణ్మయి,551. మొత్తం పదవ తరగతి విద్యార్థుల సంఖ్య 101 విద్యార్థుల కు గాను 52 మంది విద్యార్థులు 500 పైన మార్కులు సాధించి ప్రతిభను కనబరిచారు వీరిని పాఠశాల కరస్పాండెంట్ డైరెక్టర్, భగవతి పద్మనాభగౌడ్, సన్మానించి మాట్లాడారు విద్యార్థులు పడిన కష్టానికి ఈ విజయం సాధ్యమైందని భవిష్యత్తులో మంచి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి శ్రీకాంత్, అకాండమిక్ ఇంచార్జ్ సి శివానంద్, ప్రతిభ సాధించిన విద్యార్థులను సన్మానించారు.

# మహాత్మ జ్యోతిబాపూలే (MJP) గురుకులంలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



అమృత్ తెలంగాణ , ఇచ్చోడ :తెలంగాణ మహాత్మ జ్యోతిబాపూలే ఇచ్చోడ గురు కుల విద్యాలయ సొసైటీ పరిధిలోని జూనియర్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ ప్రవేశానికి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లుగు మహాత్మ జ్యోతిబాపూలే గురుకులం బాలుర నర్సాపూర్, ఇచ్చోడ ప్రిన్సిపల్ ఆర్ నారాయణ తెలిపారు. బుదవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గురుకుల జూనియర్ కళాశాలలో ఎం.పీ.సీ, బై.పి.సి, హెచ్.ఈ.సి గ్రూప్ లలో సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విద్య సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణులైనా విద్యార్థులు మాత్రమే ఈ ప్రవేశానికి అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు మే 12వ తేదీ వరకు సొసైటీ అధికారిక వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని, ఇంతకు పూర్వం ఎం జె పి లో చదివిన పదవ తరగతి విద్యార్థులు నేరుగా ఆన్ లైన్ లో అప్లై చేసుకునే వెసులుబాటు ఉన్నదని చెప్పారు. మరిన్ని వివరాల కోసం mjptbcwreis. telangana.gov.in వెబ్ సైట్, కళాశాలకు వచ్చి సంప్రదించాలని ఆయన సూచించారు. ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్, పదో తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించ డం జరిగిందనీ స్పష్టం చేశారు. పదో తరగతి ఫలితాల్లో అద్భుతమైన ఫలితాలలో1 ఎస్ విగ్నేష్, 566/600, మణికంఠ రెడ్డి, 558/600, అంజు కుమార్ 558/600 స్కూల్ టాపర్ లుగా నిలుచారని ఆయన వెల్లడించారు.

# రాళ్ల బండి మహేంద్రను పరామర్శించిన ఎమ్మెల్యే పాయల్ శంకర్



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ మావల మాజీ సర్పంచ్, బిజెపి సీనియర్ నేతగా పనిచేసి రెండు రోజుల క్రితం అకాల మరణం పొందిన రాళ్ల బండి సుదర్శన్ కుటుంబాన్ని మంగళవారం స్థానిక శాసనసభ్యులు పాయల్ శంకర్ పరామర్శించారు. సుదర్శన్ కుమారుడు రాళ్ల బండి మహేందర్ ను పరామర్శించి గతంలో పార్టీకి సుదర్శన్ చేసిన సేవలు గురించి ప్రస్తావించారు. రాళ్ల బండి సుదర్శన్ మంచి అనుబంధం ఉందని ఆయన మృతి తీరనిలోటని పాయల్ శంకర్ పేర్కొన్నారు.

# బసవేశ్వర జయంతి నివాళులు అర్పించిన బోరంచు శ్రీకాంత్ రెడ్డి



నినాదాలు చేస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి


అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : కుల వ్యవస్థను వ్యతిరేకించి సమానత్వాన్ని ప్రబోధించిన అభ్యుదయవాది మహాత్మా శ్రీ బసవేశ్వర 892వ జయంతి సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మహాత్మ బసవేశ్వర చౌక్ లో అయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి సమాజంలో ఉన్న అనేక మూఢాచారాలను పారద్రోలి కులమత రహిత సమాజాన్ని నిర్మించడానికి కృషిచేసిన ప్రముఖ సంఘ సంస్కర్త శ్రీ బసవేశ్వర అని శ్రీకాంత్ రెడ్డి అన్నారు. వారి సేవలను గుర్తుచేసుకుంటూ నినాదాలు చేసారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, నలిమేల నవీన్ రెడ్డి, వెంకటేష్, జ్ఞానేశ్వర్, హక్కీ తదితరులు పాల్గొన్నారు.

# కుల వర్ణ వివక్షణను రూపుమాపడం కోసం కృషి చేసిన మహానీయుడు మహాత్మ బసవేశ్వరుని బాటలో ప్రతి ఒక్కరు నడవాలని పాయల్ శంకర్ అన్నారు



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్: పట్టణంలోని బసవేశ్వర చౌక్ వద్ద అధికారికంగా నిర్వహించిన బసవేశ్వర 892వ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షి షా తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మ బసవేశ్వరుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ... దుర్భరమైన జీవితాలు గడుపుతున్న ప్రజల బతుకుల్లో వెలుగులు నింపేందుకు సమాజంలో వివక్షతను రూపుమాపేందుకు కృషి చేసిన మహానీయుడు బసవేశ్వర అని అన్నారు. ఆ మహనీయుని స్ఫూర్తితో సమాజంలో మార్పు కోసం ప్రతి పౌరుడు పాటుపడాలన్నారు. పలువురు బీసీ సంఘాల నాయకులు, లింగాయత్ సమాజ్ సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు.

# రువి గ్రామం లో పోచమ్మ ఆలయం మూర్తి ప్రతిష్టపన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

నిర్మల్ జిల్లా ముధోల్ ఏప్రిల్ 30 అమృత తెలంగాణ ముధోల్ మండలం లోని కోనేరు పోచమ్మ ఆలయం లో మూర్తి ప్రతిష్టపన వేడుకల్లో ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ పాల్గొని పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే ను స్వాగతించి, అమ్మ వారి తీర్థ ప్రసాదా లను అందజే శారు. ఆయన వెంట మాజీ ఎం. పి పి. నర్సాగౌడ్, మాజీ ఎం పిటి సి సతీష్ రెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు పోతన్న,మాజీ సర్పంచ్ మధు పటేల్ తదితరులు పాల్గొన్నారు..

# రువి గ్రామం లో పోచమ్మ ఆలయం మూర్తి ప్రతిష్టపన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

నిర్మల్ జిల్లా ముధోల్ ఏప్రిల్ 30 అమృత్ తెలంగాణ ముధోల్ మండలం లోని కోనేరు పోచమ్మ ఆలయం లో మూర్తి ప్రతిష్టపన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, పాల్గొని పూజలు నిర్వహించారు.. ఈ సందర్భంగా గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యేను స్వాగతించి, అమ్మ వారి తీర్థ ప్రసాదా లను అందజే శారు. ఆయన వెంట మాజీ జడ్పిటిసి సురేందర్ రెడ్డి, బ్రహ్మంగావ్ మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి, మాజీ ఎంపీపీ అఫ్రోజ్ కాన్, రవి మాజీ సర్పంచ్ లాలా బాయి, గౌతమ్, రాజన్న రంగా రావు గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు



విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

# నారి శక్తి నారి శక్తి ప్రోగ్రాం లో బాగంగా మహిళా సిబ్బంది చేసే పెట్రోలింగ్ డ్యూటీ తో పాటు అవేర్నెస్ కార్యక్రమాలు

.నిర్మల్ జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్.

అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి నారి శక్తి పోగ్రాం లో బాగంగా ఈ రోజు అన్ని పోలీస్ స్టేషన్ల పరిదిలో మహిళ పోలీస్ సిబ్బంది పెట్రోలింగ్ డ్యూటీ తో పాటు సైబర్ మోసాలు, ట్రాఫిక్ నియమాలు, మైనర్ డ్రైవింగ్ వల్ల దుష్ఫలితాలు, మద్యం తాగి వాహనాలు నడపటం వాళ్ళ సంభవించే ప్రమాదాలు వాటికి కారకులపైన తీసుకునే చట్ట పరమైన చర్యలమీద అవేర్నెస్ కార్యక్రమాలు చేపట్టటం జరిగింది. ముఖ్యంగా గ్రామాల్లో తిరిగి గ్రామ ముఖ్యులను కలసి శాంతి భద్రత సమస్యలను కనుక్కోవటం జరిగింది. వారితో మాట్లాడి గ్రామాల్లో కొత్తవారు కనిపిస్తే వెంటనే 100 కి కాల్ చేయాలని, చైన్ స్నాచ్ దొంగల బారిన పడకుండా తీసుకోవాలన జాగ్రత్తలు, వేసవి సెలవుల్లో బయటి ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి కూడా వివరించటం జరిగింది. అదనంగా పెట్రోలింగ్ బాధ్యతలు, 100 డయల్ కాల్, ఆఫెండర్ ల కదలికలు తనికి చేయటం వంటి బాధ్యతలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో అవినాష్ కుమార్ ఐపిఎస్, ఏ.ఎస్పీ భైంసా, రాజేష్ మీన ఐపిఎస్, ఏ.ఎస్పీ నిర్మల్, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐ లు మరియు మహిళా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు






# భూ భారతి చట్టం సదస్సులు విజయవంతం జిల్లా పాలనాధికారి రాజర్షి షా





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం-2025 అవగాహన సదస్సులు జిల్లాలోని 21 మండలాల్లో విజయవంతంగా కొనసాగి ఈ రోజు చివరి రోజూ బేల మండలం ఉదయం, జైనథ్ మండలం కేంద్రం లో మధ్యాహ్నం నిర్వహించి విజయవంతంగా ముగిసాయని జిల్లా కలెక్టర్ అన్నారు. భూ భారతి చట్టం ద్వారా భూ సమస్యల పరిష్కారం అవుతాయని అన్నారు. బుధవారం నిర్వహించిన సదస్సులో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, సదన్స సభ్యులు పాయల్ శంకర్, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి జ్యోతి ప్రజ్వలన గావించి, జయ జయ హే గీతం తో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టం- 2025 ఎప్రిల్ 14 న ప్రారంభించిందని, ఈ చట్టంలోని అంశాల ద్వారా రైతు భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, ఈ చట్టం పై ప్రతి రైతు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రైతులకు మేలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం భూదార్ చట్టాన్ని రూపొందించిందని ధరణి, భూ భారతికి మధ్య ఉన్న వ్యత్యాసాలను కలెక్టర్ వివరించారు. గతంలో ఏ చిన్నపొరపాటు దొర్లిన సవరించే అవకాశం లేదన్నారు. ఇప్పుడు అలాంటి ఇబ్బందులు దూరం కానున్నాయని పేర్కొన్నారు. ఏదైనా భూమి రిజిస్ట్రేషన్ చేసినప్పుడు హద్దులతో కూడిన పట్టా పాసుబుక్ తో పాటు ఇస్తారని, తద్వారా హెచ్చుతగ్గుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. అతి త్వరలో పెండింగ్ లేదా సాదా బైనమా దరఖాస్తులకు పరిష్కారం లభిస్తుందని, తప్పుల సవరణకు ఫిర్యాదు అందిన వెంటనే స్థానిక తహశీల్దార్ 30 రోజుల విచారణ చేసి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. జూన్ 2 అనంతరం అన్ని మండలాల్లో భూ భారతిని అమలు చేస్తామని అన్నారు. MLA పాయల్ శంకర్ మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నాయని, భూ భారతితో సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. చట్టాల పై ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ధరణి లో రైతులు చాలా కష్టపడ్డారని , అన్ని సమస్యలకు ఈ కొత్త చట్టం లో పరిష్కారం లభిస్తుందని తెలిపారు. మనిషి జీవితంలో అత్యంత అతి ముఖ్యమైనది భూమి అని అన్నారు. అనంతరం జైనథ్ మండల కేంద్రం లో చివరి సదస్సును నిర్వహించి రైతుల సమస్యలకు పరిష్కార మార్గం చూపిస్తూ, భూ దార్ ద్వారా ఆదార్ కార్డ్ లాగే భూ దార్ కార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గత 14 రోజుల పాటు నిర్వహించిన భూ భారతి చట్టం పై అవగాహన సదస్సులు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో RDO వినోద్ కుమార్, amc ఛైర్మెన్, తహసిల్దార్ , మార్కెట్ ఛైర్మెన్ అశోక్ రెడ్డి, టెంపుల్ ఛైర్మెన్ రూపేష్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి,, రెవెన్యూ సిబ్బంది, రైతులు, ప్రజా ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది .

## పలు వివాహాది శుభకార్యాలు, ప్రారంభోత్సవాలకు ఆదిలాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క కలిసి హాజరై అభినందనలు తెలిపిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన పలు వివాహాది శుభకార్యాలు, ప్రారంభోత్సవా లకు ఆదిలాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క కలిసి హాజరై అభినందనలు తెలిపిన తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి వారి వెంట కాంగ్రెస్ పార్టీ మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ అట్ల గోవర్ధన్ రెడ్డి, నలిమేలనవీన్ రెడ్డి,వెంకటేష్, జ్ఞానేశ్వర్, హక్కీ పాల్గొన్నారు.

## యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా నిర్వహించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.






అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి:- బుధవారం హైదరాబాదులో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్.చౌహాన్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, పౌర సరఫరాల అధికారులతో ఆయన వారి ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో ఈ సంవత్సరం యాసంగి పంట 54 లక్షల 89 వేల ఎకరాల్లో సాగు కాగా, దాదాపు కోటి 37 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి అంచనా వేశామని తెలిపారు. ప్రభుత్వం ద్వారా సుమారు 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని వివరించారు. కొనుగోలు ప్రక్రియపై జిల్లా కలెక్టర్లు ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో తేమ, తూకం, శుద్ధీకరణ యంత్రాలు, టార్పాలిన్ షీట్లు, గన్ని బస్తాలు లాంటి వసతులు సమృద్ధిగా ఉండేలా చూడాలని ఆదేశించారు. తరుగు పేరిట అదనంగా ధాన్యం తీసుకోవద్దని స్పష్టం చేశారు. ధాన్యం రవాణా కోసం తగినన్ని లారీలు సిద్ధంగా ఉంచాలని, కూలీల కొరత లేకుండా ముందస్తుగా ఏర్పాట్లు చేయాలన్నారు. గోదాముల పర్యవేక్షణ కూడా నిరంతరంగా కొనసాగించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి కేంద్రంలో అవసరమైన యంత్రాలు, సామగ్రి అందుబాటులో ఉంచామని వివరించారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ)తో కలిసి పర్యవేక్షణ చేపడతామని, నిర్ణిత సమయంలో ధాన్యం కొనుగోలు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ సుధాకర్, వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఏ డి మార్కెటింగ్ గజానంద్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం బసవేశ్వర జయంతి వేడుకలు అధికారికంగా ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అధికారులు బసవేశ్వర మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,బసవేశ్వర మహారాజ్ నాటి కాలంలోనే సమాజంలో అసమానతలను తొలగించి సమాన త్వాన్ని నెలకొల్పేందుకు

నిరంతరం కృషి చేశారని అన్నారు. మహిళల హక్కుల కోసం పోరాడిన విప్లవాత్మక నాయకుడుగా ఆయనను కొనియాడారు. ప్రతి ఒక్కరూ బసవేశ్వర ఆలోచనలు, విలువలనుఅనుసరించాలనిఆయనసూచించారు

ఈ కార్యక్రమం లో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, సీపీఓ జీవరత్నం, ఎస్సి కార్పొరేషన్ ఈ డి శంకర్, పరిశ్రమల మేనేజర్ నరసిం హారెడ్డి, అధికారులు, వీరశైవ లింగాయత్ ప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థిని మృతి

మక్కువ (మన్యం) :అమృత్ తెలంగాణ: రోడ్డు ప్రమాదంలో డిగ్రీ విద్యార్థిని మృతి చెందిన ఘటన బుధవారం మధ్యాహ్నం మన్యం జిల్లాలోని మక్కువలో జరిగింది. మక్కువ పోలీస్ స్టేషన్ హెచ్ సి శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ప్రకారం మక్కువ మండలంలోని తూరుమామిడి గ్రామ సమీపంలో ఉన్న రోడ్డు పై స్కూటీని ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటర్ పై వెనుక భాగాన కూర్చుని వస్తున్న కురసాని నూకమ్మ అలియాస్ ఉమ ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. నూకమ్మ బొబ్బిలి ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని సాలూరు సిహెచ్సికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మఅతురాలు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల వెల్లడించారు. విద్యార్థిని మృతితో కుటుంబం ఒక్కసారిగా విషాదంలో మునిగింది. అలాగే తూరుమామిడి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి మఅతురాలు కుటుంబానికి సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## పదవ తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుభాకాంక్షలు తెలిపారు. రాత్రింబవళ్లు కష్టపడి చదివి విజయాన్ని సాధించిన విద్యార్థులు, వారిని ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి బుధవారం విడుదలైన ఫలితాల్లో నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో కలెక్టర్ స్పందిస్తూ, ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించండి" అని ఆకాంక్షించారు. అనుత్తీర్ణులైన విద్యార్థులు అధైర్యపడవద్దని, తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ విజయం వైపు ప్రయాణం కొనసాగించాలని కలెక్టర్ సూచించారు.

# యర్రబల్లి ఎత్తిపోతల పనులకు బ్రేక్

కడప ప్రతినిధి :అమృత్ తెలంగాణ: వైఎస్ఆర్ జిల్లా పులివెందుల నియోజకవర్గ పరిధిలోని యర్రబల్లి-చిత్రావతి (యుసిఐఎల్) ఎత్తిపోతల పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆగిపోయాయి. భూసేకరణ సమస్య కూడా ప్రధాన అడ్డంకిగా మారింది. 2007 నవంబర్‌లో వేముల మండలం ఎం.తుమ్మలపల్లి సమీపంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కంపెనీ ఏర్పడింది. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా చేపట్టిన తవ్వకాల కారణంగా వేముల మండలంలోని కనంపల్లి, వేల్పుల, కనంకిందకొట్టాల, భూమయ్యగారిపల్లి, తుమ్మలపల్లి, మబ్బుచింతలపల్లి, రాచకుంటపల్లి గ్రామాల్లోని తాగునీరు కలుషితం కావడంతో అంతుబట్టని చర్మ, ఇతర ప్రాణాంతక వ్యాధులు ప్రబలాయి. దీంతో ఆయా గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగారు. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పులివెందుల నియోజవర్గం లింగాల మండలంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి యర్రబల్లి ఎత్తిపోతల ద్వారా రెండు టిఎంసిల తాగునీటిని ఆయా గ్రామాలకు సరఫరా చేయాలని నిర్ణయించింది. 2021 జనవరిలో రూ.852 కోట్లతో 48.36 కిలోమీటర్ల పైప్‌లైన్ పనులకు టెండర్లు పిలిచింది. కాంట్రాక్టును ఎంఆర్‌కెఆర్ కన్స్ట్రక్షన్ దక్కించుకుంది.












# చారిత్రాత్మకం - చైతన్యవంతం.. మేడే

అమృత్ తెలంగాణ

అనేక పెట్టుబడిదారీ దేశాల్లో ఆర్థిక సంక్షోభం తీవ్రమవుతున్న వేళ.. ఆ సంక్షోభ భారాలను పాలకులు సాధారణ శ్రామికులపై నెట్టేస్తున్న వేళ.. ఆ భారాలకు వ్యతిరేకంగా బాగా అభివృద్ధి చెందిన అమెరికాతో సహా కార్మికోద్యమాలు పెరుగుతున్న వేళ.. ప్రజల అసంతృప్తి కారణంగా అనేక దేశాలలో ప్రభుత్వాలు కూలిపోతున్న వేళ.. మనదేశంలో శ్రామికవర్గ హక్కులపై తీవ్రమైన దాడి జరుగుతున్న వేళ.. శ్రామిక వర్గం మేడే జరుపుకుంటోంది.

ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

సామ్రాజ్యవాదం ముఖ్యంగా అమెరికా కుతంత్రాలు, సోషలిస్టు క్యూబాపై కొనసాగుతున్న ఆర్థిక ఆంక్షలు, మాతృభూమి రక్షణకోసం రక్తం ఓడుతున్న పాలస్తీనా, ఉత్తరకొరియా, చైనా దేశాలపై హూంకరింపులు, అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్ గెలిచిన తరువాత అనేక దేశాలతో చేస్తున్న సుంకాల యుద్ధాలు ఇవన్నీ అమెరికా, మిగిలిన సామ్రాజ్యవాద దేశాలు తమతమ దేశాలలోని ఆర్థిక సంక్షోభాల నుండి గట్టెక్కడానికే. "సామ్రాజ్యవాదం ఉన్నన్నాళ్లూ యుద్ధాలు అనివార్యం" అన్న లెనిన్ మహాశయుని నిర్ధారణ అక్షర సత్యాలని ప్రపంచ పరిణామాలు సూచిస్తున్నాయి. నేడు ప్రపంచంలో ఎక్కడ యుద్ధాలు జరుగుతున్నా అవి సామ్రాజ్యవాదం, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదం జోక్యంతోనే అన్నది వాస్తవం. గాజాపై అమెరికా అండతో ఇజ్రాయెల్ చేస్తున్న మారణహోమం అత్యంత అమానవీయం. కాల్పుల విరమణ ఒప్పందాన్ని కూడా ఇజ్రాయెల్ ఉల్లంఘిస్తోంది. సిరియా, యెమెన్, ఇరాన్, లెబనాన్, ఇరాక్ దేశాలపై కూడా బాంబు దాడి చేసింది.

ప్రత్యామ్నాయం వైపు చూపు..

ప్రపంచం అపరిమిత రుణ భారంలోకి ప్రవేశిస్తోంది. సామ్రాజ్యవాద శక్తులు సంక్షోభం యొక్క మొత్తం భారాన్ని ప్రపంచ దక్షిణాది దేశాల కార్మికులు, ప్రజలపై నెట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ సంక్షోభం శ్రామిక ప్రజల కష్టాలను పెంచుతూనే, నయా ఉదారవాద పెట్టుబడిదారీ వ్యవస్థ దివాళాకోరుతనాన్ని సమిష్టిగా ఎదుర్కోవడానికి ఒక అవకాశాన్ని కూడా కల్పిస్తోంది. ఈ దాడులకు వ్యతిరేకంగా శ్రామిక ప్రజల్లోని వివిధ వర్గాల ప్రతిఘటన కూడా పెరిగింది. రెండు నెలల్లోనే కార్మికవర్గం రెండు భారీ సమ్మెలు చేయడంతో గ్రీస్ దేశం స్తంభించిపోయింది. గాజాలో ఇజ్రాయెల్ చేసిన మారణహోమానికి వ్యతిరేకంగా, పాలస్తీనా ప్రజల హక్కుల కోసం నిలబడటానికి ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు ముందుకు రావడం కూడా ధైర్యాన్నిస్తుంది. తాజాగా శ్రీలంక ఎన్నికలలో వామపక్ష అభ్యర్థి గెలుపు ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారన్న దానికి తార్కాణం.

భారత కార్మికవర్గం - ముందున్న సవాళ్ళు..

దేశంలోని సహజ వనరులను, ప్రభుత్వ ఆస్తులను ఒక పథకం ప్రకారం బడా పెట్టుబడిదారులకు ధారాదత్తం చేయడానికి తోడ్పడేలా ప్రభుత్వ విధానాలను రూపొందించి, మొత్తంగా ఆర్థిక యాజమాన్య వ్యవస్థ స్వరూపాన్నే మోడీ ప్రభుత్వం మార్చేసింది.

సామాన్యులను దోచుకుని, కార్పొరేట్లు లాభపడేలా చేయడమే ఈ విధానాల సారం. ఉద్యోగాలలో కోత, సైన్యంతో సహా అన్ని ప్రభుత్వ సంస్థలలో కాంట్రాక్టు పద్ధతి, పెన్షన్ సంస్కరణలు ఈ విధానాలలో భాగమే. ఎన్‌పిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) పునరుద్ధరించాలని దేశవ్యాపితంగా ఉద్యోగులు పోరాడుతుంటే, ఆ పని చేయకపోగా యూపీఎస్ అనే మరో మోసపూరిత పథకాన్ని తీసుకు వచ్చింది. దీనికితోడు ఓపిఎస్‌ను కూడా బలహీనపరిచేలా నూతన పీఆర్సీ పెరుగుదలలు పాత పెన్షనర్లకు వర్తించవని దొడ్డిదారి చట్టం చేసింది. ఈపిఎస్‌లో కనీస పెన్షన్ పెంచడానికి ససేమిరా నిరాకరిస్తోంది. మొత్తం అన్నిరకాల పెన్షన్ నిధులన్నీ షేర్ మార్కెట్‌లో పెడుతూ, కార్పొరేట్లకు సిరులు కురిపిస్తోంది.

భారత కార్మికవర్గ ఉద్యమం క్లిష్టతరమైన సవాళ్లతో కూడిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. పాలకవర్గం ప్రతిస్పందన మరింత దూకుడుగాను, నిరంకుశంగానూ మారింది. ప్రజాస్వామ్య హక్కులను ప్రజలు క్రమంగా కోల్పోతున్నారు. రాజ్యాంగంపై పెద్దఎత్తున దాడి జరుగుతోంది. ఈ దాడి, నయా ఫాసిస్ట్ లక్షణాలను ప్రదర్శించే బిజెపి నేతృత్వంలోని ఎన్డీఏ పాలన యొక్క ముఖ్య లక్షణంగా మారింది.

ప్రభుత్వానికి తగ్గిన బలం.. లేబరు కోడ్‌లు..

ఈసారి 400 సీట్లు పైమాటే అని దేశ ప్రధానితో సహా పాలక పార్టీ నేతలు ఎంత ఊదరగొట్టినా, 18వ లోక్‌సభ ఎన్నికలలో మోడీ ప్రభుత్వం పూర్తి మెజారిటీని కూడా కోల్పోయింది. దీనికి ప్రధాన కారణం రైతులు, ముఖ్యంగా కార్మికవర్గం యొక్క స్థిరమైన ప్రతిఘటనా ఉద్యమాలే. పార్లమెంటులో బలం చాలా తగ్గిపోయినప్పటికీ, కార్పొరేట్ మతతత్వ సంబంధానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అన్ని రంగాలలో తీవ్రమైన నిరంకుశ చర్యల ద్వారా నయా ఉదారవాద విధానాలను ముందుకు తీసుకుపోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మొత్తం ఉపాధి రంగంలో అనిశ్చితను ప్రోత్సహించడానికి సంఘటిత, అసంఘటిత రంగాలలోని ఉపాధి సంబంధాలు నిరంతరం పునర్నిర్మించబడుతున్నాయి. దీని ఉద్దేశం కేవలం కార్మిక వ్యయాలను తగ్గించడం మాత్రమే కాదు, మరింత ముఖ్యంగా కార్మికుల హక్కుల కోసం పోరాడే ట్రేడ్ యూనియన్లను నిర్మూలించడానికి, వారిపై వాస్తవిక బానిసత్వ పరిస్థితిని విధించడం. తాజాగా చేసిన లేబర్ కోడ్‌లు ఈ ప్రక్రియను సులభతరం చేస్తాయి. శాశ్వత ఉపాధి అనేది పెద్ద ఎత్తున ఔట్ సోర్సింగ్, అప్రెంటీస్‌లు, ట్రైనీలు, ఇంటర్న్‌షిప్‌లు మొదలైన వాటి ద్వారా భర్తీ చేయబడి, కార్మికులను కార్మికచట్టాల పరిధికి




వెలుపల ఉంచడానికి వినూత్న పరిభాషను ఉపయోగిస్తున్నారు.

ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ..

విద్యుత్, బొగ్గు, ఖనిజాలు, పోర్టు, డాక్, బ్యాంకింగ్, బీమా రంగాలలో పాలకులు ముఖ్యంగా ప్రైవేటీకరణను దూకుడుగా కొనసాగిస్తున్నారు. అయితే, ప్రభుత్వ రంగాన్ని, భారతదేశ ప్రజల ప్రయోజనాలను కాపాడటానికి సర్వశక్తితో కార్మికులు కూడా పోరాడుతున్నారు. దేశంలోని రైతు ఉద్యమం చారిత్రాత్మక రైతు పోరాటం ద్వారా రద్దు చేసిన నల్ల చట్టాలను, దొడ్డిదారుల ద్వారా క్రూరమైన వ్యవసాయ చట్టాలను తిరిగి ప్రవేశపెట్టడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కొత్త వ్యవసాయ మార్కెటింగ్ విధానం అటువంటి మోసపూరిత చర్యలకు నిదర్శనం. మనదేశ వ్యవసాయ మార్కెట్‌ను తమ ఉత్పత్తులకు బార్లా తెరవాలన్న అమెరికా ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం సిగ్గు లేకుండా లొంగిపోతోంది. ప్రభుత్వ చర్యలన్నీ అడవులు, భూమి, సముద్రం వంటి మన సహజ వనరులను దోచుకుని, దాని సన్నిహితులకు, గుత్తాధిపత్య పెట్టుబడికి ప్రయోజనం చేకూర్చడానికి ఉద్దేశించబడ్డాయి. ఇవన్నీ పర్యావరణంపై హానికరమైన ప్రభావాన్ని చూపుతూ, వినాశకరమైన వాతావరణ మార్పులకు తోడ్పడుతున్నాయి.

కార్పొరేట్లకు నజరానాలు..

బహుముఖ ప్రోత్సాహక పథకాల ముసుగులో జాతీయ ఖజానా నుండి పెట్టుబడిదారీ వర్గాలకు నేరుగా సబ్సిడీ ఇవ్వడానికి వివిధ చర్యలు ప్రవేశపెట్టబడుతున్నాయి. ప్రజల ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కులను అణచివేయడం ద్వారా నయా ఉదారవాదానికి వ్యతిరేకంగా ఉన్న అన్ని వ్యతిరేకతలను అణచివేయడానికి ప్రయత్నాలు చేస్తోంది. ఉపా, పిఎంఎల్ఏ మొదలైన వాటితో పాటు భారతీయ న్యాయ సంహిత వంటి కొత్త చట్టాల ద్వారా ప్రజల సమిష్టి నిరసనలను నేరంగా పరిగణించేంతవరకు వెళుతోంది. అదే సమయంలో మోడీ ప్రభుత్వం "జన్ విశ్వాస్" చట్టం అని పిలవబడే నిబంధనల ప్రకారం బాయిలర్ చట్టం, అటవీ చట్టం, టీ చట్టం, రబ్బరు చట్టం, ఔషధ రంగానికి సంబంధించిన 41 చట్టాల కింద కార్పొరేట్ల 180 నేరాలను నేరరహితం చేసింది. తాజా కేంద్ర బడ్జెట్లో యాజమాన్యాల మరో 100 నేరాలను నేరాల నుండి తొలగించారు. ఇది కార్మిక చట్టాలతో సహా చట్టాలను శిక్షార్హత లేకుండా ఉల్లంఘించడానికి ఒక లైసెన్స్ తప్ప మరొకటి కాదు.

హక్కులపై దాడులు..

మరోవైపు కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను నిలబెట్టుకోవడానికి చేసే సమిష్టి చర్యలను సైతం నేరంగా పరిగణిస్తున్నారు. కార్మికులు, వారి సంఘాలు సమిష్టిగా ఫిర్యాదు చేయడాన్ని బిఎన్ఎస్ (భారతీయ న్యాయ సంహిత) సెక్షన్ 111 కింద 'వ్యవస్థీకృత నేరం'గా పరిగణించి, బెయిల్ లేని జైలు శిక్షతో సహా పోలీసు చర్యలకు దారితీస్తుంది. ఇప్పటికే అనేక బిజెపి పాలిత రాష్ట్రాల్లో కార్మిక సంఘాల నాయకులు, కార్మికుల ఫిర్యాదులను యాజమాన్యానికి లేదా కార్మికశాఖకు సమర్పించినందుకు తప్పుడు క్రిమినల్ కేసుల్లో ఇరికించబడ్డారు. కార్మిక నియమావళి అమలుకు ముందే, ముఖ్యంగా ప్రభుత్వ సంస్థలు / విభాగాలలో గేట్ మీటింగులు, డిపార్ట్‌మెంటల్ సమావేశాలు, కరపత్రాల పంపిణీ, మెమోరాండం సమర్పించడం వంటి సాధారణ ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలు వాస్తవంగా నిషేధించబడ్డాయి. ఇవి కార్మికులలో భయానక వాతావరణాన్ని సృష్టించడానికి ఉద్దేశించినవి. దేశం రికార్డు స్థాయి గరిష్ట నిరుద్యోగాన్ని, నిజ వేతనాలలో నిరంతర క్షీణతను చూస్తోంది. నికర విలువ జోడించిన దానిలో వేతనాల వాటా 2020లో 18.9 శాతం నుండి 2023లో 15.9 శాతానికి తగ్గింది. అదే కాలంలో లాభాల వాటా నికర విలువ జోడించిన దానిలో 38.7 శాతం నుండి 51.9 శాతానికి పెరిగింది. తీవ్ర పేదరికం, పోషకాహార లోపం దేశంలో పెరుగుతున్నాయి. ప్రైవేట్ మైక్రోఫైనాన్స్ సంస్థలు సూపర్ లాభాలను ఆర్జించడం ద్వారా పేద వర్గాలలో రుణభారం ఆందోళనకరంగా పెరుగుతోంది.. ఇది చాలా మంది రుణగ్రస్తులను చేస్తూ ముఖ్యంగా అన్నదాతలను ఆత్మహత్యలకు నెట్టివేస్తోంది.ప్రభుత్వ విధానాల మూలంగా దేశంలో ఎన్నడూ లేనంతగా ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. 2022-23 ప్రపంచ అసమానతల నివేదిక దేశంలో కేవలం ఒక్క శాతం సంపన్నులు 22.6 శాతం ఆదాయాలను, 40.1 శాతం దేశ సంపదను స్వంతం చేసుకుంటున్నారని వెల్లడించింది. బ్రిటిష్ కాలం కంటే కూడా ఇది భారతదేశ చరిత్రలో అత్యధికంగా ఉంది. ఇదే సందర్భంలో దేశంలోని అట్టడుగు 50 శాతం మంది చేతుల్లో కేవలం మూడు శాతం సంపద మాత్రమే ఉంది.

మతతత్వ విధానాలు.. రాజేస్తున్న విద్వేషాలు..

ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని హిందూత్వ శక్తులు సమాజాన్ని మతతత్వానికి గురిచేస్తున్నాయి. ఇది ఐక్యతను దెబ్బతీస్తుంది. నయా ఉదారవాద దాడికి వ్యతిరేకంగా ఐక్య పోరాటాన్ని బలహీనపరుస్తుంది. మోడీ నేతృత్వంలోని ప్రభుత్వ పాలనా, చట్టపరమైన పాలనా ప్రక్రియను, దాని సారం.. పరిపాలనతో సహా మొత్తం విద్యావ్యవస్థను తారుమారు చేస్తూ మైనారిటీలపై మతపరమైన విషాన్ని , ద్వేషాన్ని వ్యాప్తిచేస్తోంది. మైనారిటీలలో మత ఛాందసవాద శక్తులు కూడా చురుగ్గా పనిచేస్తున్నాయి. మతతత్వ శక్తులను సైద్ధాంతికంగా, రాజకీయంగా, సామాజికంగా, సాంస్కృతికంగా.. వీధుల్లో ఎదుర్కోవడానికి, శ్రామికవర్గ ఐక్యత, సంఘీభావాన్ని కాపాడుకోవడానికి కార్మికవర్గం దృఢ సంకల్పాన్ని చూపించాలి.

ప్రజానుకూల పాలనలో..

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రతీకార, వివక్షతో కూడిన రాజ్యాంగ విరుద్ధ చర్యలను సవాలు చేస్తూ, శ్రామిక ప్రజల హక్కులు, జీవనోపాధిని కాపాడుతూ, ప్రజానుకూల విధానాలను అమలు చేస్తున్న కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం పెట్టుబడిదారీ సమాజ పరిమితులకు లోబడే ప్రత్యామ్నాయ విధానాలను దేశానికి అందిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ..

రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన తెలుగుదేశం- జనసేన- బిజెపి కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ వినాశకర విధానాలనే కొనసాగిస్తోంది. రాష్ట్రంలో సోదర భావంతో ఉండే వివిధ తరగతుల ప్రజల మధ్య చిచ్చులు పెట్టడానికి గోతికాడ నక్కలా కాచుకుని కూర్చున్న మతతత్వ శక్తులకు ఊతం ఇచ్చేలా టిడిపి, జనసేన వ్యవహరించడం అత్యంత ఆందోళనకరం. అంతేగాక, ఆంధ్ర రాష్ట్రానికే ప్రమాదకరంగా మారనున్నాయి. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన రాష్ట్రంలో శ్రామిక ప్రజల ఐక్యతను కాపాడుకోవడం ప్రథమ కర్తవ్యంగా ఉండాలి.

డబుల్ ఇంజన్ సర్కార్ వస్తే విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిపోతుందనే భ్రమలను కాస్తా పటాపంచలు చేస్తూ, కూటమి పార్టీలు పూర్తిగా మోడీ ప్రభుత్వానికి సహకరిస్తున్నాయి. మరో అడుగు ముందుకు వేసి రాష్ట్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంటుకు అతి సమీపంలోనే అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద ప్రైవేట్ ఆర్సలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు చకచకా సన్నాహాలు చేస్తుంది. అంతేకాక, దానికి అవసరమైన ఇనుప ఖనిజం, పోర్టు వంటివి కూడా కల్పిస్తోంది. మరోపక్క కార్మిక పోరాటాలపై నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు, కేసులు వంటివి హామీకి భిన్నంగా గత ప్రభుత్వంలో లాగానే కొనసాగుతున్నాయి. కనీస వేతనాల సవరణ లేదు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరున బడా సంస్థలకు భూమితో సహా వనరులను దోచి పెడుతున్నారు.

పెరుగుతున్న ప్రతిఘటన..

దేశంలో ఇంతకు ముందెన్నడూ లేనివిధంగా జరుగుతున్న విద్వేషపూరితమైన పరిస్థితులను శ్రామికవర్గం ధైర్యంగా ప్రతిఘటిస్తోంది. ప్రాథమిక హక్కుల కోసం, ప్రభుత్వ దురాగతాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికసంఘాలు అసంఖ్యాక పోరాటాలు నిర్వహించాయి. తమిళనాడులో శాంసంగ్ కార్మికుల సమ్మె ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గానికి స్ఫూర్తిని ఇవ్వడమే కాకుండా, భారతదేశ కార్మికవర్గానికి మరింత ఉత్సాహాన్నిచ్చింది. విద్యుత్ ఉద్యోగుల పోరాటాలు, సమ్మెలు ఆయా తరగతిని సమీకరించడంలోను, ప్రైవేటీకరణ బాధితులైన ప్రజల నుండి మద్దతును కూడగట్టడంలోనూ కొత్త ప్రమాణాలను ఏర్పరుస్తున్నాయి. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా గత నాలుగేళ్లకు పైగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ కార్మికులు అలుపెరగని పోరాటాన్ని కొనసాగిస్తూ, కేంద్ర ప్రభుత్వాన్ని నిలవరించారు. ఈ మధ్యకాలంలో అనేక సంస్థలలో కాంట్రాక్ట్ కార్మికులు చేసిన కొన్ని విజయవంతమైన పోరాటాలు, సరైన దిశలో పోరాడుతూ ఉంటే ప్రభుత్వ దుర్మార్గాలను ఎదుర్కోవడం సాధ్యమేనని నిరూపించాయి. కార్మికశక్తిని బలహీనపరచడం వంటి పాలకవర్గం కుట్రలు చివరికి విజయవంతం కాలేదనే విశ్వాసాన్ని సృష్టిస్తున్నాయి. వివిధ విభాగాల స్కీమ్ వర్కర్లు, ముఖ్యంగా అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజన పథకం కార్మికులు రాష్ట్ర, అఖిల భారత స్థాయిలో.. నిరంతరం దృఢమైన పోరాటాలు చేస్తూ అనేక విజయాలు సాధించారు.

సమానత్వం ద్వారానే సాధికారత

మనదేశంలో శ్రామిక మహిళల సంఖ్య ఇటీవల కాలంలో ఎంతో పెరుగుతోంది. కానీ మొత్తం శ్రామిక మహిళల శక్తి పాల్గొనే రేటు సుమారుగా 25% నుండి 30% మధ్యే ఉంటుంది. ఇది ప్రపంచ సగటుతో పోల్చితే తక్కువే. వ్యవసాయ రంగంలో 55-60 శాతం, ఉద్యోగ, సేవా రంగాలలో సుమారు 20 శాతం, తయారీ పరిశ్రమలలో 10 శాతం వరకు పనిచేస్తున్నారు. అదే పనికి పురుషులతో పోలిస్తే తక్కువ వేతనాలు, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు, అసురక్షిత పని ప్రదేశాలు, అత్యధిక పని గంటలు, విశ్రాంతి లేకపోవడం జరుగుతుంది. దీనివలన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా నైపుణ్య శిక్షణ లేకపోవడం, అవిద్య వంటి సమస్యలు అదనం. ఇంటిచాకిరి ఊడా మహిళల మీదే ఎక్కువ. వెరసి ఇవన్నీ వారి పని సామర్థ్యాన్ని తగ్గిస్తున్నాయి. శ్రామిక మహిళలకు ప్రత్యేకంగా ఉన్న చట్టాలే తక్కువ కాగా, ప్రసూతి చట్టం, సమాన పనికి సమాన వేతన చట్టం, లైంగిక వేధింపుల నిరోధక చట్టం వంటివి ప్రభుత్వ సంస్థలతో సహా అనేకచోట్ల అమలుకావడం లేదు. దీనికి తోడు రాత్రి వేళల్లో కూడా పనిచేసేలా చట్ట సవరణలు కూడా ప్రభుత్వం చేసింది. వ్యవసాయం, స్వయం ఉపాధి రంగాలలో పనిచేస్తున్న మహిళలకు అసలు ఏ చట్టాలూ వర్తిచడం లేదు. దీనికి తోడు మన దేశంలో సామాజిక వివక్షత, లింగ అసమానతలు ఎలాగూ ఉన్నాయి. గౌరవ వేతనం పేరున కోటి మందికి పైగా ఉన్న స్కీం వర్కర్ల నిలువు దోపిడీ కొనసాగుతూనే ఉంది. దేశ సంపద సృష్టిలో ప్రత్యక్ష పాత్ర నిర్వహిస్తున్న శ్రామిక మహిళల పట్ల వివక్షత దేశానికే అనర్థం. వీరి సమస్యల పరిష్కారం, సమానత్వం సాధించకుండా సాధికారత పేరున ఎన్ని ఉపన్యాసాలు ఇచ్చినా నిరుపయోగమే. ప్రభుత్వం నుండి సరైన ప్రోత్సాహంతో పని ప్రదేశాల్లో సురక్షిత వాతావరణం, సమాన వేతనాలు, ప్రత్యేక సెలవులు, చట్టాల వర్తింపు, వాటి పటిష్ఠ అమలు, సామాజిక అవగాహన వంటివి కల్పించాలి.

కర్తవ్యాలు..

సంపదను కొద్దిమందికి దోచిపెట్టే మోడీ ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలి. శ్రామికవర్గం రోజువారీ సమస్యలపై పోరాటం కొనసాగిస్తూనే, పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క డొల్లతనాన్ని బహిర్గతం చేయాలి. బలమైన కార్మిక, కర్షక ఐక్యతను నిర్మించడం ద్వారా ప్రభుత్వ విధానాలను మార్చేలా, ప్రత్యామ్నాయ విధానాల కోసం శ్రామికవర్గం పునరంకితం కావాలి. ప్రజాస్వామ్యం, లౌకికవాదాన్ని కాపాడుకోవడంలో విస్తృత ఐక్య ఉద్యమాలను నిర్మించాలి. దోపిడీ లేని ప్రత్యామ్నాయ సమాజాన్ని స్థాపించడం లో కార్మికవర్గం పాత్ర గురించి విస్తృత స్థాయిలో అవగాహన, చైతన్యం కల్పించాలి. సామ్రాజ్యవాదాన్ని అంతమొందించడం, శ్రామికవర్గ అంతర్జాతీయవాదం పెంపొందించడం వంటి లక్ష్యాలతో మన దేశంలో మెరుగైన సమాజం కోసం శ్రామికవర్గం ముందుకు కదలాలి. హక్కులు, ఐక్యత కాపాడుకుంటూ ముందుకు, ముమ్ముందుకు కొనసాగుదాం.. మేడే వర్ధిల్లాలి!